# ఎన్నిక

తటవర్తి రామచంద్రరావు




"ఆమధ్య మా అమ్మా నాన్న వచ్చారు. రెండుమూడు రోజుల్లో ఇద్దరమ్మాయిలతో పెళ్ళి చూపులరేంజి చేశారు. ఇద్దరికిద్దరూ బావున్నారు. ఇద్దరితోటీ మాట్లాడాను. కాని, ఎవర్ని చేసుకోవాలో నాకు తెలియటం లేదురా! నువ్వు చూసి నీ అభిప్రాయం చెప్పు" అన్నాడు రఘురామ్ రైలు దిగి వచ్చిన స్నేహితుడు మోహన్‌తో.

"వాళ్ళని చూసేముందు వాళ్ళ వివరాలు తెలిస్తే మంచిది."

"సునందది కళ్లు మిరుమిట్లు గొలిపే అందం. జోవియల్‌గా మాట్లాడుతుంది. ఎయిర్‌టెల్‌లో ఎగ్జిక్యూటివ్. మంచి రిసోర్స్‌ఫుల్ పెర్సన్. రెండో అమ్మాయి అపర్ణ. సునందలా స్టన్నింగ్ బ్యూటీ కాదు. కాని, చక్కగా పోతపోసిన శిల్పంలా వుంటుంది. మితభాషి. కంప్యూటర్స్ చేసింది. నిట్‌లో ఫేకల్టీ ఉద్యోగం.

"వాళ్ళతో మాట్లాడానన్నావు. దాన్నిబట్టి నీకు తెల్సిందేమిటి?"

"సునందని సినిమా హాల్లో ఓసారి, షాపింగ్ సెంటర్లో ఓసారి చూశాను. వాళ్ళ ఫ్రెండ్స్‌తో కనిపించింది. ఇదివరకే వాళ్ళకి చెప్పినట్టుంది. వాళ్ళకి పరిచయం చేసింది. మర్యాదకని మా యింటికి రమ్మన్నాను. నిజంగానే వాళ్ళ ఫ్రెండునో దాన్ని తీసుకుని హఠాత్తుగా ఓ



సండేనాడు వచ్చేసింది. నేను లుంగీ బనీనులో వున్నా. సిగ్గుపడి చచ్చిపోయాననుకో!''

''తప్పేముంది? హఠాత్తుగా అమ్మాయిలు తలుపుతడతారేమోనని మనం టీవీ సీరియల్స్‌లోలా ఎప్పుడూ సూటూబూటూ వేసుకుని వుండలేం కదా! సరే, ఏమయింది?''

''గబగబా బట్టలు మార్చుకుని ఆ కబురూ యీ కబురూ అయ్యాక కాఫీ కలిపి తెచ్చాను. సునంద డేమ్ ప్లీజయిపోయింది. వెడుతూ వెడుతూ వాళ్ళింటికి ఎప్పుడొస్తానా అని అడిగింది. మేగ్నెటిక్ పర్సనాలిటీ అనుకో!''

''అంటే, నువ్వు పెళ్ళికొప్పుకున్నావని అనుకుంటోందన్నమాట!''

''అవును. నాకలాగే అనిపిస్తోంది.''

''మరి అపర్ణ?''

''మా మామయ్యగారి ఫ్యామిలీ వస్తే వాళ్ళని మ్యూజియంకి తీసుకువెళ్ళా. అక్కడికి వాళ్ళక్కయ్యగారి పిల్లల్ని తీసుకుని వచ్చింది. పిల్లలు ఎగ్జిబిట్స్ చూస్తుంటే మేమవీయివీ మాట్లాడుకున్నాం. వాళ్ళ ఇన్‌స్టిట్యూట్ మా యింటికి దగ్గరగానే ఉందిట. మర్యాదకి ఎప్పుడేనా రమ్మన్నాను. ఓ సాటర్‌డేనాడు తన కొలీగ్ వాళ్ళమ్మాయి బర్త్‌డే పార్టీ అంటే వచ్చిందట! మా వీధిలో కనిపించింది. ఇన్వయిట్ చేశాను. ఇల్లంతా చూపిస్తే నా టేస్టుని మెచ్చుకుంది. కాఫీ కలిపి తెస్తానంటే తనూ వంటింట్లోకి వచ్చింది. వద్దువద్దంటున్నా తనే కలిపింది. మా యింటికి వచ్చి మీరు కలపటమేమిటన్నాను. ఆవేళ పెళ్ళిచూపుల్లో తాను తెచ్చిన కాఫీ తను కలిపింది కాదుట... అందుకని... అని నవ్వింది. ఇన్క్రెడిబుల్ ఉమన్!''

మోహన్ ఆలోచనలో పడ్డాడు.

''వేన్నీళ్ళు కాగుతున్నాయి. నువ్వీలోగా షేవ్ చేసుకుంటావా?''

''కొంచెం జ్వరం తగిలినట్టుందిరా! ఈ పూట మానేస్తాను.''

అతని ఒళ్ళు పట్టుకుని చూసి ''అయ్యో! నాకోసం జ్వరంతో వచ్చావా!'' అన్నాడు రఘురామ్.

''బయల్దేరినప్పుడు లేదు.''

''కాఫీ తెస్తా. మాత్ర వేసుకో!''

''అలాగే కాని, ఈ అవతారంతో వాళ్ళింటికి వెళితే బాగుండదు. వాళ్ళకే ఫోన్ చేసి ఓసారి రాగలరేమో అడుగు. వాళ్ళతో మాట్లాడాక నా అభిప్రాయం చెబుతాను.''

''ఇంతవరకు నేనిద్దర్నీ చూసిన విషయం వాళ్ళకి తెలీదు. ఎలాగ?''

''ఇద్దర్నీ కలవాలన్నాను కాని ఒకేసారి కాదు. గంట తేడాలో రమ్మను. ఆ తర్వాత నీకెక్కడో అర్జంటు పని వుందని చెప్పు. వాళ్ళు రాకముందే ఏదో పని పెట్టుకుని వెళ్ళు. తర్వాత నాకు ఫోన్ చేయి. లైన్ క్లియర్ కాకపోతే చెపుతాను...''

***

బెల్లు మోగేసరికి వెళ్ళి తలుపు తీశాడు మోహన్. రఘురామ్ అన్నట్టే ఆమెది కళ్ళు మిరుమిట్లు గొలిపే అందం. ''రండి రండి. మీరేకదూ సునంద!'' అని ఆహ్వానించాడు.

''అవునండి. ఆయన ఏరి?'' అని ఇల్లంతా కలయజూసింది.

''ఇప్పుడే ఏదో పనిమీద వెళ్ళాడు. వచ్చేస్తాడు. కూర్చోండి.

ఆమె ముఖం ముడుచుకుంది. ''పన్నెండింటికి వెళ్ళాలన్నారు. అప్పుడే వెళ్ళిపోయారా?''

''ఎవరిదో ఫోనొస్తే వెళ్ళాడు. తొందరగానే వచ్చేస్తానన్నాడు''

ఆమె కుర్చీలో అసహనంగా కదిలింది. వీధివైపే మాటిమాటికీ చూడసాగింది.

''మీ గురించి రఘు చెప్పాడు. గ్లాడ్ టు మీట్ యూ!''

ఆమె ముఖంలో అసహనం తగ్గి ప్రసన్నత మొగ్గ తొడిగింది.

''మీరందంగా ఉంటారని రఘు చెప్పాడు. కాని, వాడు చెప్పినదానికన్నా ఎక్కువ అందంగా ఉన్నారు మీరు!''

ఆమె ముఖంలో సిగ్గు తెరలకన్నా అతిశయపు పరదాలు ఎక్కువగా తెరచుకున్నాయి.''

''మీకభ్యంతరం లేకపోతే ఒకటడగనా?''

''అడగండి.''

''మీ స్పేర్ టైంలో ఏం చేస్తుంటారు? ఐ మీన్ మీ హాబీస్ ఏమిటి?''

ఆమె జవాబు చెప్పకుండానే ఆమె సెల్‌ఫోను మ్రోగింది. బేగ్‌లోంచి తీసి పట్టుకుని కొంచెం దూరంగా వెళ్ళి లోగొంతుకతో మాట్లాడింది. ఆమెకి ఇబ్బంది కలగకుండా అతను మంచినీళ్ళు తెచ్చుకునే వంకతో వంటింట్లోకి వెళ్ళాడు. అక్కర్లేకపోయినా అక్కడే నిలబడి నెమ్మదిగా త్రాగి వచ్చాడు. వస్తూ ఆమెకో గ్లాసు నీళ్ళు తెచ్చిచ్చాడు.

ఆమె తన సెల్‌ని బేగ్‌లో పెట్టుకుంటూ బిడియంగా నవ్వింది .. ''నా ఫ్రెండు..''

అతనూ పల్చగా నవ్వి ''కూర్చోండి'' అన్నాడు మంచినీళ్ళ గ్లాసందిస్తూ.

థేంక్స్ చెప్పి మంచినీళ్ళు తాగింది. ''మీరేదో అడిగారు. ఇంతలో...''

''అదే ఈ హాబీస్ గురించి...''

''... కాలేజీ రోజుల్లో పిక్నిక్‌కనో, సైట్ సీయింగ్‌కనో వెళ్ళేదాన్ని. పుస్తకాలు బాగా చదివేదాన్ని. ఇప్పుడు జాబ్‌లో చేరాక వీకెండ్స్‌లో షాపింగ్‌కి వెళ్ళాలంటేనే స్పేర్ టైమ్ దొరకడం లేదు. ఇంట్లో వుంటే టీవీ చూస్తుంటాను. అంతే!'' అని నవ్వింది.

ఇంతలో ఆమె సెల్‌ఫోన్ మోగింది. ''సారీ!'' అని ఈమాటు తన సెల్ తీసుకుని బయటికి వెళ్ళిపోయింది. ఆమె తిరిగి వచ్చేసరికి అతను మంచంమీద కళ్ళు మూసుకుని కనిపించాడు. ''అయామ్ సారీ...!'' అంది.

''సెల్ కంపెనీలో పని కదా! ఫోన్లు తప్పవు మరి...'' అని నవ్వాడు.

''అది కాదండీ! మీకు జ్వరమని మీ ఫ్రెండు చెప్పారు. అడగడం మర్చిపోయాను.''

''మామూలు జ్వరమే! ఇంతకీ ఎవర్ది ఫోను?''

''మా అన్నయ్య. ఎక్కడున్నానో తెలియక ఫోన్ చేశాడు'' అని బిడియంగా నవ్వింది.

''మీ ఫేవరెట్ డిషెస్ ఏమిటి?''

''నూడుల్స్ అంటే ఇష్టం. బర్గర్ లైక్ చేస్తాను. చెప్పాలంటే ఫ్రెండ్ ఫ్రియస్ నా ఫేవరెట్ ఐటమ్!''

''ఇవేవయినా మీకు తయారుచెయ్యటం వచ్చా?''

అదేం ప్రశ్న అన్నట్టు చిత్రంగా చూసింది. ''మనం తయారుచేయాల్సిన అవసరమేముందండీ? మార్కెట్లో రెడీమేడ్‌గా దొరుకుతుంటాయి కదా!''


''మా రఘుకి బొబ్బట్లంటే మహాయిష్టం. వాళ్ళమ్మగారు ప్రతి పదిహేను రోజులకీ పులిహోర చేస్తుండేవారు. ఏవి చేసినా నన్ను వాళ్ళింటికి లాక్కుపోయేవాడు.

ఆమె ముఖం ఎర్రనయింది. తెచ్చిపెట్టుకున్నట్టున్న ఆమె నవ్వులో జీవం లేదు.

''మీ యింట్లో ఇవేవీ చేసుకోరా?'' అని యధాలాపంగా అడిగినట్టడిగాడు.

కంగారుగా నవ్వింది. ''చేసుకుంటామండీ. కానీ, ఎందుకంత శ్రమ. స్వగృహా ఫుడ్స్‌లో దొరుకుతాయి కదా అంటాడు మా అన్నయ్య!''

''పులిహోర కూడా దొరుకుతోందా? నాకా సంగతి తెలియదు..''



''అహ! బొబ్బట్ల విషయం చెపుతున్నా. సంక్రాంతికి, దీపావళికి అమ్మ పులిహోర చేస్తూంటుంది!'' అంది సునంద ఇబ్బందిగా ముఖంపెట్టి.

''ఏమిటీ తిండిపోతు మనిషితో మాటలు అనుకుంటున్నారా?''

అతనిలా ఫ్రీగా నవ్వలేకపోయింది. ''అబ్బే, అదేమీ కాదండీ!''

''సారీ, మావాడింకా రాలేదు... మీకు కాఫీ కలిపి ద్దామంటే!''

''అబ్బే వద్దండీ! బయల్దేరేముందే తాగాను''

ఇంతలో టెలిఫోన్ మోగింది. అదెవరి ఫోనో మోహన్ గ్రహించి చటుక్కున పైకి లేచి రిసీవర్ అందుకున్నాడు. ''... రఘు బయటికి వెళ్ళాడండీ! సారీ, ఎప్పుడొస్తాడో చెప్పలేను. వచ్చాక మీరు ఫోన్ చేశారని చెప్తాలెండి. నేనా? వాళ్ళ ఫ్రెండ్‌ని'' అని తమ సంకేతం ప్రకారం ఫోన్ పెట్టేశాడు.

''కాసేపట్లో వస్తారని చెప్పారు మీరు?'' అంది ఆమె తెల్లబోతూ.

''వెంటనే వస్తానన్నాడు. మరెందుకని ఆలస్యమైందో!'' అన్నాడు తొణక్కుండా.

అతనింకేం ప్రశ్నలు వేస్తాడో అన్నట్టు ఇబ్బందిగా కుర్చీలో కదిలిందామె. ''నాకు ఫోన్ చేసినప్పుడు పన్నెండింటికి వెళ్ళాలన్నారు!''

ఆమెనింక అడగవల్సిందేమీ కనిపించలేదు. అపర్ణ రాకముందే ఆమెను పంపివెయ్యాలి!

''మీరు వచ్చి వెళ్ళారని చెపుతాను. మీకాలస్యమవుతుందేమో పాపం!'' అన్నాడు.

ఆమె ముఖం తేటపడింది. ''మా అమ్మావాళ్ళు ఎదురు చూస్తుంటారు. ఏమనుకోకండి''

''ఫర్వాలేదు, కొంచెం తలుపులు దగ్గరగా వేసి వెళ్ళండి చాలు.''

ఆమె వెళ్ళిపోతుండగా ఆమె బేగ్‌లోని సెల్‌ఫోన్ మళ్ళీ మ్రోగడం మోహన్‌కి వినిపించింది!

జ్వరభారంతో నెమ్మదిగా మగత నిద్రలోకి జారాడు. అలా ఎంతసేపున్నాడో అతనికి తెలియదు. కాలింగ్‌బెల్ మోగి లివి తెచ్చుకున్నాడు. అప్రయత్నంగా గోడవైపు చూశాడు. గడియారంలో పన్నెండు! రఘురామ్ అపర్ణకి చెప్పిన టైమది! ఎంత పంక్చువల్‌గా వచ్చింది. 'కమిన్ ప్లీజ్!' అని కేక పెట్టాడు.

తలుపులు నెమ్మదిగా తెరచుకుని ఆమె లోపలికి వచ్చింది. తను వ్రాసిన ఒక మంచి నవలలోంచి అతిచక్కని పాత్రలా నడిచి వచ్చింది. ముచ్చటగా తీర్చిదిద్దిన ముఖం. సౌష్టవమైన శరీరం. చీరకట్టులో ఒక హుందాతనం! ఆమె దగ్గరకి కదలివస్తూంటే మనసుకి నచ్చిన పరిమళాన్ని మోసుకువచ్చినట్టనిపించింది!

అతను పైకి లేవబోతే ''అయ్యో! లేవకండి'' అని వారిస్తూ తన చేతిలోని బత్తాయిల బేగ్‌ని టీపాయి మీద పెట్టింది. ''జ్వరం ఎక్కువగా ఉందాండీ?'' అని అతన్ని పరీక్షగా చూస్తూ అడిగింది.

''ఎంతుందో తెలియదు. భారంగా ఉంది. నిలబడే వున్నారు. కూర్చోండి''

''ఫర్వాలేదు. ఏదైనా మందు వేసుకున్నారా?''

''రఘు ఇచ్చి వెళ్ళాడు. వేసుకుందామనుకుంటున్నా... ఇంతలో మీరు వచ్చారు''

''ఆయనెక్కడికి వెళ్ళారు? ఉంటారనుకున్నాను!''

''ఇంతకుముందే ఎవరిదో ఫోనొస్తే వెళ్ళాడు. తొందర్లోనే వచ్చేస్తానన్నాడు. కూర్చోండి.''

''ఇప్పుడే వస్తానుండండి'' అని టీపాయ్ మీద పెట్టిన బేగ్‌లోంచి మూడు బత్తాయిలు తీసుకుని వంటింట్లోకి వెళ్ళింది. మరు నిమిషంలో గ్లాసు నీళ్ళతో వచ్చి ''ముందు మందు వేసుకోండి. ఇంతలో బత్తాయి రసం తీసిస్తా!'' అంది.

''మీకెందుకండీ శ్రమ!''

''భలేవారే! ఇందులో శ్రమేముంది? మనింట్లో ఎవరికయినా సుస్తీ చేస్తే ఆమాత్రం చేయమా!'' అని మందహాసం చేసి తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఏదో అద్భుతమైన అనుభూతితో అతని వొళ్ళు రోమాంచితమైంది. కావాలనే అంతవరకూ మాత్ర వేసుకోకుండా జ్వరభారాన్ని ఓర్చుకున్నాడు. తలగడ కింద నుంచి రఘు ఇచ్చిన మాత్ర తీసుకుని వేసుకున్నాడు.

తలుపులు నెమ్మదిగా తెరచుకుని ఆమె లోపలికి వచ్చింది. తను వ్రాసిన ఒక మంచి నవలలోంచి అతిచక్కని పాత్రలా నడిచి వచ్చింది. ముచ్చటగా తీర్చిదిద్దిన ముఖం. సౌష్టవమైన శరీరం. చీర కట్టులో ఒక హుందాతనం! ఆమె దగ్గరకి కదలి వస్తూంటే మనసుకి నచ్చిన పరిమళాన్ని మోసుకు వచ్చినట్టనిపించింది!

ఆమె చాలా తొందరగా తిరిగి వచ్చింది. ''కొంచెం తాగండి. సత్తువగా వుంటుంది.''

''సేవచేసే వాళ్ళుంటే రోగమంత సుఖం లేదుట!'' అంటూ పైకి లేచాడతను.

''భలేవారే! ఈమాత్రం దానికే అంత పెద్ద పేరెందుకు?'' అంది బిడియంగా నవ్వి.

''ఈ బ్రహ్మచారి ఇంట్లో ఏవెక్కడున్నాయో మీకెలా తెలుసు?''

''ఇదివరకోసారి వచ్చాను'' అంది సిగ్గుతో కళ్ళు దించుకుంటూ.

సునందని అడిగినట్టే హాబీల గురించి అడిగాడు.

ఆమె కొన్ని క్షణాల మౌనం తర్వాత చెప్పింది. ''నిజం చెప్పాలంటే నా హాబీస్ ఫలానా అని చెప్పలేను. ఏం చేసినా నాకిష్టమే!''

కుతూహలంగా అడిగాడు – ''అంటే?''

''చిన్నప్పుడు సంక్రాంతికి ముగ్గులు పెట్టేదాన్ని. అమ్మ నేర్పింది. తను మ్యూజిక్ కాంపిటీషన్సులో పాల్గొనేది అక్క. అక్కతోపాటు శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా పిన్నిగారి అబ్బాయి ఎగ్జిబిషన్‌లో షార్ట్ మోడల్ పెట్టాలంటే థెర్మోకోల్‌తో తయారుచేసిపెట్టాను. అప్పట్నుంచి స్పేర్ టైమ్‌లో బొమ్మలు చేయడం అలవాటైంది. కాలేజీ మేగజైన్స్‌లో నా కవితలు రెండు వచ్చాయి. అప్పట్నుంచి ఏదైనా మంచి దృశ్యం చూసినప్పుడు, ఏ సంఘటన గురించయినా విన్నప్పుడు ఏదో భావావేశం పొంగి వస్తుంది. ఓ కవితగా దానికి అక్షరరూపమిచ్చేవరకూ నాకు తోచదు...''

''అంటే, అందర్నీ ఆనందపెట్టడం మీ మెయిన్ హాబీ అన్నమాట!''

ఆమె చిరునవ్వులో వెన్నెల!

''మీ గురించి రఘు చెప్పాడు. మీ అందమంతా మీ కళ్ళల్లో ఉందని. కానీ, మీ అందమంతా మీ మాటల్లో వుంది.''

''నాలో ఏమీ లేదు. నా మీద అభిమానంతో మీరంటున్నారు. అంతే!''

ఆ నిరాడంబరతతో ఆమె వ్యక్తిత్వమంతా ప్రతిఫలించింది. ఆమెనింక అడగవల్సినవి అతనికి కనిపించలేదు. ''రఘు ఇంకా రాలేదు. ఏంచేతో...'' అని అర్థోక్తిగా ఆగిపోయాడు.

''ఒంటిగంటకు వెళ్ళాలన్నారు. కాని, ఇంత త్వరగా ఎందుకు వెళ్ళారో మరి? మీకు జ్వరంగా కూడా ఉంది.''

''ఇంకెక్కడి జ్వరం? మీ మందు పడ్డాక అది ఎప్పుడో దిగిపోయింది.''

ఆమె ముఖం విప్పారింది. ''మళ్ళీ ప్రయాణమై వెళ్ళాలి కదా! విశ్రాంతి తీసుకోండి''

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది. మోహన్ రిసీవర్ ఎత్తాడు. ''అపర్ణ ఉందాండీ?'' అని ఆమె తల్లి అడిగింది. అతను విస్తుపోతూ ఆమెకి ఫోన్ అందించాడు. తాను మరికాసేపు ఆగి వస్తానని, తనకోసం ఎదురు చూడవద్దని, తల్లిని భోజనం చేసెయ్యమని చెప్పింది ఆమె.

''పాపం, ఆవిడ మీకోసం వెయిట్ చేస్తున్నట్టున్నారు.!''

''ఫర్వాలేదండి. మీరిలా ఉండగా ఎలా వెళతాను? ఆయన వచ్చేదాకా ఆగుతాను''

''వాడెప్పుడు వస్తాడో ఏమో! అయినా, మీరు కంగారుపడాల్సింది లేదు. నాకు జ్వరం తగ్గిపోయింది.''

''మీ భోజనం?''

''మీరు పళ్ళరసం ఇచ్చారు. మీరు తెచ్చిన పళ్ళింకా వున్నాయి. రఘు ముందే పాలు, బ్రెడ్డు తెచ్చిపెట్టి వెళ్ళాడు. ఈ పూటకివి చాలు. ప్రొద్దున్న జ్వరంతో రాలేక మిమ్మల్ని పిలిపించమన్నాను. లేకపోతే నేనే వచ్చి మిమ్మల్ని చూడాల్సింది. సారీ, మీకు ట్రబులిచ్చాను!''

''అయ్యో, ఎంతమాట! మీరక్కడికి వచ్చినా, నేనిక్కడికి వచ్చినా ఒకటే కదా! మీతో పరిచయం కావటం ముఖ్యం! అందుకు నాకు చాలా సంతోషంగా ఉంది!''

***

రఘురామ్ వస్తూనే బ్రెడ్డు పాలు తెచ్చి మిత్రుడికిచ్చాడు. దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. ''ఇప్పుడు చెప్పరా నీ వోటు ఎవరికి?'' అని ఆత్రుతగా అడిగాడు.

''మెరుపుతీగ కళ్ళు జిగేల్మనిపిస్తుంది. థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అదే వెన్నెల అయితే నెమ్మదిగా పెరు

గుతూ, తరుగుతూ ఎప్పటికప్పుడు సరికొత్తగా మెత్తగా ఉంటుంది. చల్లగా ఉల్లాసభరితంగా వుంటుంది. మెరుపు తీగ కావాలా నీకు వెన్నెల కావాలా? నిర్ణయించుకోవాల్సింది నువ్వు!''

''వాళ్ళేమన్నారో చెప్పసలు!''

వాళ్ళతో తనకు జరిగిన సంభాషణని తు.చ. తప్పకుండా చెప్పుకువచ్చాడు మోహన్.

''ఇద్దరికీ నాకు జ్వరంగా వుందని చెప్పావు. నీ బెస్టు ఫ్రెండునని వాళ్ళని చూడాలని అనుకుంటున్నానని చెప్పావు. సునంద తన అందచందాలతో ఆకర్షించాలని చక్కగా మేకప్ చేసుకుని వచ్చింది. అపర్ణ అలా కాదు. నిరాడంబరంగా ఒక పేషెంటుని చూడ్డానికి వచ్చినట్టు వచ్చింది. బత్తాయి పళ్ళు తీసుకుని మరీ వచ్చింది. నా ఫ్రెండు లేడు – సారీ మీకు కాఫీ పెట్టివ్వటానికి అని నేనంటే సునంద తను తాగే వచ్చానంది. మీరు తాగుతారా అని నన్నడగలేదు. కాని, అపర్ణ నేను వద్దంటున్నా తను పళ్ళరసం తెచ్చిచ్చింది. వచ్చిన పావుగంట తర్వాత గుర్తొచ్చి సారీ – మీకు జ్వరమెలా వుందో అడగటం మర్చిపోయానంది సునంద. వస్తూనే మాత్ర వేసుకున్నారా అని అడిగి తెలుసుకుని మంచినీళ్ళు తెచ్చిచ్చి మందు వేసుకోమంది అపర్ణ. సునందకి ఇక్కడున్న ఇరవై నిముషాల్లో మూడు ఫోన్ కాల్స్ వచ్చాయి. నువ్వన్నట్లు ఆమె రిసోర్స్‌ఫుల్ పెర్సన్. ఫ్రెండ్స్‌కి బాగా ఉపయోగపడుతుంది. ఆమెకు ఫ్రెండ్స్ కావాలి. అది ఆమెకో సరదా! ఓ హాబీ! కాని, అడక్కుండానే బాధ్యత తలకెత్తుకునే వ్యక్తి అపర్ణ. నేను పరాయి వాడ్ని. అయినా జ్వరం వచ్చిందని తెల్సినపుడు నా గురించి తాపత్రయపడింది. ఇక ఇంట్లో వాళ్ళకోసం ఎంత బాధ్యత తీసుకుంటుందో మనం అంచనా వేయచ్చు. ఎవరి దగ్గరికి వెళుతోందో ఇంట్లో చెప్పకుండా వచ్చింది సునంద. తనిక్కడికే వస్తున్నట్టు సరాసరి తల్లికి చెప్పి మరీ వచ్చింది అపర్ణ. తనకు అప్పటికప్పుడు తోచినది చేస్తుంది సునంద. ఆలోచించి అడుగువేస్తుంది అపర్ణ.

మా రఘుకి బొబ్బట్లు, పులిహోర చాలా యిష్టమని నేనంటే.. ఈరోజుల్లో ఇంట్లో ఎవరు చేసుకుంటున్నారు, స్వగృహ ఫుడ్స్‌లో అన్నీ దొరుకుతున్నాయి అన్నట్టు మాట్లాడింది సునంద. పైగా తనకి నూడుల్స్, ఫ్రెంచ్ ఫ్రయిస్ ఇష్టమని చెప్పింది. ఆమెదంతా ఫాస్ట్‌ఫుడ్ కల్చర్! అంతవరకు అపర్ణతో మాట్లాడాక మన సంప్రదాయాల మీద ఆమెకున్న గౌరవాభిమానాల గురించి తెలిశాక ఆమెకేవంటలు ఇష్టమో, చేయటం వచ్చునో నాకడగాల్సిన అవసరం కనిపించలేదు. చిన్నప్పుడు తన తల్లి దగ్గర ముగ్గులు వేయటం ఎలా నేర్చుకుందో, అక్క దగ్గర సంగీతం ఎలా నేర్చుకుందో చెప్పింది. బొమ్మలు చేస్తుంది. కవితలు వ్రాస్తుంది. ఆమెది కళాత్మకమైన హృదయమే కాదు. ఒకర్ని ఆనందపెట్టాలన్న అంతఃకరణ ఉన్న వ్యక్తిత్వం! ఒకవేళ ఆమెకేదయినా రాకపోయినా చిత్తశుద్ధితో వెంటనే నేర్చుకోగలదు. చేసి చూపించగలదు.

''ఒకావిడకు తాననుకున్నది సాధించడం తెలుసు. ఇంకొకామెకు అందిన దానిలో ఆనందించటం తెలుసు! ఒకామె ఎదుటి వాళ్లని మాట్లాడనివ్వదు. ఇంకొకామె ఎదుట వ్యక్తి చెప్పేదాన్ని శ్రద్ధగా విని మాట్లాడుతుంది! ఒకామెకి అందుకోవడంలో ఆనందం. ఇంకొకామె అందివ్వటంలో ఆనందం. ఇలా ఎన్నయినా అనంతంగా చెప్పుకుపోవచ్చు. సునంద అద్భుతమైన అందగత్తె. ఆమె నీ భార్య అయితే అందరి కళ్ళూ మీమీదే ఉంటాయి. నీ అదృష్టమని అంతా అసూయపడతారు. రేపు నువ్వామెకు కారు కొనలేకపోతే తనే నీకు కారు కొనిపెట్టగలదు. బాగా ఖర్చుపెట్టించటమే కాదు, బాగా సంపాదించగలదు. మేగ్నటిక్ పెర్సనాలిటీ అన్నావు. సక్సెస్‌ఫుల్ ఎగ్జిక్యూటివ్ కూడా! అలాంటి కలలరాణి కావాలనుకుంటే ఆమె నీకు స్యూటబుల్...!

కాని, నీ భార్యగా ఇంట్లో నిన్నలరించి, నీకేం కావాలో అమర్చిపెట్టి, బయట బాధ్యతాయుతంగా మెలిగి అందరి మన్ననలు పొంది, నీ మోటారు సైకిలు మీదనే వెనక కూర్చున్నందుకు సంతృప్తిపడి, గుండె నిండిన గర్వంతో వెళ్ళే తృప్తిని నీకివ్వగలిగే అర్ధాంగి చాలనుకుంటే అపర్ణ నీకు సరిజోడీ!

ఇక ఎవర్ని నువ్వు ఎన్నుకుంటావో నీ యిష్టం!''

★



## ఆ ముగ్గురే స్ఫూర్తి

సుమారు వెయ్యి షోలలో పాల్గొన్నాను. అన్నీ బెస్ట్ గా అనిపించినవే. నాక్కాదు జనాలకు. అందుకే ఈరోజు శ్రేయా తల్పాడే అంటే చాలామంది అభిమానిస్తున్నారు అని చెప్పుకుంటున్నారు ఈ తల్పాడే. థియేటర్ పెర్ఫామింగ్‌నుంచి తిన్నగా 'బ్లాక్' సినిమా వరకూ వచ్చిన ఇతను నాకు స్ఫూర్తినిచ్చింది ఆ ముగ్గురే అని చెబుతున్నాడు. ఎవరూ అంటే సల్మాన్, షారుఖ్, హృతిక్‌లంటాడు. మరీ ముఖ్యంగా హృతిక్ డాన్స్‌లు తనకు బాగా స్ఫూర్తినిచ్చాయని చెప్పుకుంటున్నాడు. ఇక మేకప్ మెరుపులు మెరిపించిన ఇక్బాల్, నగేష్ కుకునూర్‌లను ఎప్పుడూ గుర్తుకు తెచ్చుకుంటూ వుంటానని చెప్పుకునే శ్రేయాస్ తల్పాడే భవిష్యత్ కలలు గంటున్నాడు.